క్లుప్తంగా

బల్లిగిరి వెంకన్నకు శ్రవణా నక్షత్ర పూజలు


విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం వెంకన్న జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం బల్లిగిరి వెంకన్నను విశేషంగా రంగు రంగుల పువ్వులతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా..


అల్లిపురం మెయిన్‌రోడ్డులో మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

అల్లిపురం: దసరా వచ్చిందయ్యా.. మజా తెచ్చిందయ్యా.. అంటూ శనివారం దసరా అయినా అంత మజా లేదు. ఆదివారమే దసరా మజా నగరంలో కానవచ్చింది. మద్యం దుకాణాల వద్ద మద్యం కోసం బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి నుంచి పొట్టేళ్ల వేటలు వేయటంతో రాత్రంతా బిజీగా గడిపారు. దుకాణాల యజమానులు వారి కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. దీంతో దసరా మజా అంతా ఆదివారం కనిపించింది.

వైభవంగా శత చండీయాగం


శ్రీలలితా పీఠంలో చండీయాగం నిర్వహిస్తున్న వైదికులు

సీతంపేట : శ్రీలలితా పీఠంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాలు, శత చండీయాగం శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. 108 ద్రవ్యములు, వివిధ రకాల పండ్లు, పట్టు చీరలు పూర్ణాహుతిలో సమర్పించారు. వేద పండితుల మంత్రాల మధ్య మహా పూర్ణాహుతి, మహా స్నపనం, దీక్షా విరమణ, వేదాశీర్వాదంతో ఉత్సవాలు ముగించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు లలితా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

మాంసాహార దుకాణాలు కిటకిట


సీతమ్మధారలో వినియోగదారులతో రద్దీగా మాంసం దుకాణం

సీతమ్మధార : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకున్నారు. పండగ శనివారం అయినప్పటికీ అసలు హంగామా అంతా ఆదివారమే కనిపించింది. ఉదయం నుంచే పలు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయి కనిపించాయి. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, బాలయ్య శాస్త్రి లే అవుట్, గురుద్వారా, నక్కవానిపాలెం, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాల్లో గల చికెన్, మటన్ దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. నాటు కోళ్ల విక్రయాలు కూడా జోరుగా జరిగాయి.

పేదల సంజీవిని

- రోగులకు చక్కటి సేవలందిస్తున్న దొండపర్తి యూపీహెచ్‌సీ
- ఉచితంగా పరీక్షలు చేసి మందుల అందజేత
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సేవలు



దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం


రోగుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలోని దొండపర్తి యూపీహెచ్‌సీ ప్రజలకు చక్కటి సేవలందిస్తోంది. 2022 అక్టోబర్ 21న అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ ఆరోగ్య కేందాన్ని ప్రారంభించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు, ఎల్‌జీఎస్ వైద్య సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. రోజుకు సుమారు 50 నుంచి 70 మంది వరకు రోగులు వస్తుంటారు. అలాగే 30 నుంచి 40 వరకు పలు రకాల టెస్ట్‌లు చేయించుకుంటారు. ఈ ఆరోగ్య కేంద్రంలో 63 టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగ్యూ, హెచ్‌బీ, కిడ్నీ తదితర వ్యాధులతో పాటు వ్యాధుల నిర్ధారణకు సంబంధించి ఇతర టెస్ట్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఒక్కడ కరోనా టెస్ట్‌లు కూడా చేసి పాజిటివ్ గనుక వస్తే వారికి కిట్లు అందించి పర్యవేక్షణలో ఉంచుతారు. వైద్యురాలు డాక్టర్ శ్రావణి రోగులకు సేవలందిస్తుంటారు. 25వ వార్డుకు సంబంధించి రెండు సచివాలయాలు, 27వ వార్డుకు సంబంధించి ఆరు సచివాలయాలు కలిపి మొత్తం 8 సచివాలయాల పరిధిలోకి వచ్చే ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రం సేవలు అందుకుంటున్నారు. వారే కాకుండా నగరంలోని పలు ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ ప్రధాన వైద్యురాలు డాక్టర్ శ్రావణి, 9 మంది ఏఎన్ఎంలు, 10 మంది ఆశ వర్కర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్నారు.

ఇక్కడ చేసే పరీక్షలు..

- గుండె సంబంధిత పరీక్షలకు సీరం కొలెస్ట్రాల్, సీరంట్రైగ్లిసరైడ్స్, వీఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ఐడీఎల్ కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు చేసినప్పుడు ఎటువంటి ఆహారం, పానీయాలు తీసుకోకుండా రావలసి ఉంటుంది.
- లివర్‌కు సంబంధించి సీరం టోటల్ బైలురుబిన్, సీరం డైరెక్ట్ బైలురుబిన్, ఇండైరెక్టు బైలురుబిన్, ఎస్‌జోమెటిక్ టెస్ట్, ఎస్‌జీవోటీ, సీరం అల్బుమిన్, గ్లోబలిస్ పరీక్షలకు ఎప్పుడైనా వెళ్లొచ్చు.
- కిడ్నీ పరీక్షలు క్రియాటినిన్, యూరిక్ యాసిడ్, యూఆర్ఈఏ, సోడియం, పొటాషియం పరీక్షలు చేస్తారు. ఏ సమయంలోనైనా వెళ్లొచ్చు.
- షుగర్ పరీక్షకు ఏమీ తీసుకోకుండా వెళ్లాలి. రోగి కొన్ని నియమాలు పాటించిన తర్వాత పరీక్షలు నిర్వహిస్తారు.
- గర్భిణులకు హెమోగ్లోబిన్, బ్లడ్ షుగర్ స్క్రీనింగ్ టెస్ట్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏఈ, హెచ్‌సీవీ, వీడీఆర్ఎల్, బ్లీడింగ్ టైం, బ్లడ్ గ్రూప్ టెస్ట్, కఫం, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కంప్లీట్ బ్లడ్ కౌంట్‌తో పాటు ఇంకా పలు రకాలు పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఉచితంగా మందులు అందజేస్తారు. యూపీహెచ్‌సీలో పది పడకలు అందుబాటులో ఉన్నాయి.


ల్యాబ్

సేవలు వినియోగించుకోవాలి..



ఉదయం 9 గంటల నుంచి పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందుతాయి. 63 రకాల టెస్ట్‌లు, మందులు ఉచితంగా అందిస్తున్నాం. ప్రజలు ఈ హెల్త్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ శ్రావణి షారోన్, మెడికల్ ఆఫీసర్, దొండపర్తి యూపీహెచ్‌సీ

మందుబాబుల చిందులు


టౌన్‌కొత్తరోడ్డు వద్ద తప్పతాగి నడిరోడ్డుపై పడిన మందుబాబు



సిటీ పోలీస్ స్టాపర్ వద్ద పడి ఉన్న మందుబాబు


బౌడారా రోడ్డులోని గ్రంథాలయం వద్ద మందుబాబు

డాబాగార్డెన్స్: దసరా వచ్చిందమ్మా.. సరదా తెచ్చిందమ్మా.. మందుబాబులకు మత్తు ఇచ్చిందమ్మా. అసలే ఆదివారం. ఆపై దసరా పండగ హడావిడి. ఇంకేముంది. ముక్కలు తిన్నవారు ముక్కలు.. మందు తాగిన వారు మందుతో ఫుల్ ఎంజాయ్ చేశారు. దసరా శనివారం రావడంతో ఎవరూ కోడెలు, మేకలు, గొర్రెలు బలి ఇవ్వలేదు. శనివారం అర్ధరాత్రి తర్వాత మేకలు, గొర్రెలు, కోళ్లను తెగ నరికారు. ఉదయం వరకూ మాంసాల పంపిణీ కార్యక్రమంలో నిమగ్నమైన మందుబాబులు.. ఇంటికి మాంసం అందజేసి మందు దుకాణాలకు క్యూ కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకు మందుబాబులు మద్యం సేవిస్తూ నడిరోడ్లపై చిందులేశారు. దుర్గా మండపాల వద్ద నృత్యాలు వేసే వారు కొందరైతే.. నడిరోడ్డుపై తప్పతాగి పడిన వారు మరికొందరు. తప్పతాగి పడిన వారిలో కొందరు నగర ప్రధాన రోడ్లపైనే చిందులేస్తూ నేలనపడ్డారు.

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలు


పారిశుద్ధ్య కార్మికులకు కానుకలు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ దసరా కానుకలు అందజేశారు. పారిశుద్ధ్య కార్మిక మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. వార్డులో స్వచ్ఛతే ప్రాధాన్యతగా పని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిబ్బంది అర్జున్, నాని, బాలకృష్ణ, సింహాద్రి, ఈశ్వరమ్మ, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు మిఠాయిలు అందజేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

పారిశుద్ధ్య కార్మికులకు మిఠాయిల పంపిణీ..

అల్లిపురం: దసరా సందర్భంగా 34వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు వార్డు యువత నీలం రాజు ఆధ్వర్యంలో మిఠాయిలు, కూల్ డ్రింకులు అందజేసి వారిని గౌరవించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావు, తెలుగు అర్జున్, రాగతి గణేష్, అంబటి వెంకటరావు, సూరాడ మసేను, తిరుపతిరావు, నడుపూరు లక్ష్మణ్ తదితరులు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఎండా కాలాన్ని మించిన ఎండ


నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న చావులమదుం జంక్షన్


ఖాళీగా దర్శనమిస్తున్న డాబాగార్డెన్స్ అంబేద్కర్ సర్కిల్ జంక్షన్

నగరవాసులను విలవిల్లాడించిన ఉక్కబోత


జనసంచారం లేని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్


జనసంచారం లేని జీవిత బీమా కార్యాలయం రోడ్డు

అల్లిపురం: రోజు రోజుకి ఎండలు ఎండాకాలాన్ని తలపిస్తున్నాయి. ఆదివారం భానుడి ప్రతాపానికి నగర వాసులు విలవిల్లాడారు. ఎండ తీవ్రత 36 డిగ్రీలను తలపించింది. చెమటతో వాహన చోదకులు, పాదచారులుతో పాటు ఇళ్లలో ఉన్న వారు కూడా ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతకు నగరంలో చాలా వరకు రోడ్లు ఖాళీగా కనిపించాయి. ఆదివారం ఆపై దసరా, లేబర్ హాలిడే కూడా తోడవటంతో నగరంలో చాలా రోడ్లు ఖాళీగానే దర్శనమిచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు డాబాగార్డెన్స్, చావులమదుం ప్రాంతాలతో పాటు అల్లిపురంలో చాలా రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం


సాయిబాబాకి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లనే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లనే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా సరే బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. అయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఇప్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, కేఎస్ చలం, ఎం.పైడిరాజు, జీడీ సారయ్య, రాజు, ఎస్.నాగభూషణరావు, వామనమూర్తి, వి.నల్లయ్య, ఎస్.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు.

అన్నసమారాధనల సందడి


అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు జీవీ రామచంద్రరావు తదితరులు


అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న పచ్చిరపల్లి రాము తదితరులు

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నియోజకవర్గంలో అన్నసమారాధనల సందడి నెలకొంది. 33వ వార్డులో బంగారుమెట్ట, శ్రీ దుర్గా నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము పాల్గొని ప్రారంభించారు. సుమారు 3 వేల మంది పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

34వ వార్డులో..

కొబ్బరితోటలో వెలసిన శ్రీ లలితా దుర్గా నూకాంబికా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు జీవీ రామచంద్రరావు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు టేకుమూడి లక్ష్మణ్, ఉమ్మడి గురుమూర్తి, ఆచంట వేణు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి


రాజరాజేశ్వరిదేవిగా ఉమాదేవి


సీపీ దంపతులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి


సాయిశ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష అలంకరణలో సాయిబాబా


కీర్తనలు ఆలపిస్తున్న ఆకొండి వెంకట్రావు శిష్య బృందం


దుర్గమ్మకు పూజలు చేస్తున్న శ్రీవత్సవ్, వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు


సాయిబాబా పుణ్యతిథి మహోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతమ్మధార: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ విశాఖపట్నం బ్రాంచి ఆధ్వర్యంలో ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన రావణ దహనం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. రావణ దహనం వేడుకలు చూడడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ప్రశాంత విశాఖ కోసం నేరాలు అదుపు చేస్తున్నామన్నారు. ప్రజలెవరైనా తనకు ఎస్ఎంఎస్, వాట్సప్, ఫోన్‌కాల్స్ ద్వారా సమస్యలు తెలియజేయవచ్చని అన్నారు. దసరా వేడుకల్లో భాగంగా రావణ దహనం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పండగ పేరిట జంతు హింస చేయడం విచారకరమన్నారు. ధర్మాన్ని ప్రజలు రక్షించాలని పిలుపు ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ అంటే పశుపక్ష్యాదులు కూడా ప్రపంచంలో ఒక భాగం అని స్పష్టం చేశారు. రక్తపాతంతో నిండిన ఆహారం అమ్మవారికి నైవేద్యంగా పెట్టి భుజించడం ఆచారంగా వస్తుందన్నారు. పోలీస్ కమిషనర్ ఎటువంటి అపాయింట్‌మెంట్ లేకుండానే ప్రజలను నేరుగా కలవడం సంతోషకరం అన్నారు. అనంతరం సీపీ రావణ దహణం వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీ కుటుంబ సభ్యులు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి నారాయణమూర్తి, సంఘమిత్ర సంస్థ విద్యార్థులు పలు వేషధారణల్లో పాల్గొన్నారు. అనంతరం రామేశ్వరి సీపీ దంపతులను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

మధురంగా దసరా సంగీత మహోత్సవం..

డాబాగార్డెన్స్: రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్రస్వామి మఠంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా 12 గంటల పాటు నిర్విరామ సంకీర్తన గానం నిర్వహించారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం వ్యవస్థాపకుడు ఆకొండి వెంకట్రావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకట్రావు శిష్య బృందం, గాయనీ గాయకులు త్యాగరాజ స్వామి కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, పురందరదాసు కీర్తనలు ఆలపించారు. కళా ప్రాంగణం సంకీర్తనలతో మార్మోగింది. కార్యక్రమంలో డాక్టర్ జి. రఘురామారావు, శాంతి దంపతులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ ఉపాధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి. మధుబాబు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశ్రమంలో..

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పాతనగరంలో గల స్వామి వివేకానంద ఆశ్రమంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సంస్థ ట్యూషన్ పిల్లలు కోలాటం ప్రదర్శించారు. శ్రీవత్సవ్ మాట్లాడుతూ సంస్థ ట్యూషన్ విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మికంగా సంకీర్తనలు, కోలాటం చక్కగా ప్రదర్శించారన్నారు. పిల్లలను అభినందించారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దిని అలంకరణలో కన్యకాపరమేశ్వరి..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఉత్సవాల చివరి రోజున కన్యకాపరమేశ్వరి మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్లు కడిమిశెట్టి వెంకట రమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీ సాయినాథుని పుణ్యతిథి..

అల్లిపురం: విజయదశమిని పురస్కరించుకుని అచ్చియ్యమ్మపేట, శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో శనివారం షిర్డీ సాయిబాబా పుణ్యతిథి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 106 దీపాలు వెలిగించారు. సాయిబాబా కీర్తనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. దీంతో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవరాత్రులు ముగిసాయని ఆలయ నిర్వాహకుడు ఉమ్మిడి నాగరాజు తెలిపారు. సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పాడిన గీతాలు ఆకట్టుకున్నాయి.

సాయిశ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో..

33వ వార్డు పరిధి సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ షిర్డీ సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. అందమైన పూలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ..

దసరా సందర్భంగా శనివారం దుర్గమ్మ రాజరాజేశ్వరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సాగరగిరి కనకదుర్గ ఆలయంలో..

యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గ అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా అనఘాలక్ష్మీదేవి అమ్మవారు..

వివేకానందకాలనీలో వెలసిన సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో అనఘాలక్ష్మీ దేవి అమ్మవారు రాజరాజేశ్వరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ధనశక్తి దుర్గమ్మ పీఠం ఆధ్వర్యంలో..

మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధన శక్తి దుర్గమ్మ పీఠం ఆధ్వర్యంలో భక్తులకు రాజా శ్యామలా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.